ప్రజాశక్తి
ఆదివారం 6 జులై 2025



భూ ఆక్రమణల తొలగింపు పక్కాగా జరగాలి

ప్రజాశక్తి-పాడేరు: ప్రభుత్వ భూముల ఆక్రమణలను పక్కాగా తొలగించాలని జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ నుండి తహశీల్దారులు, ఎంపిడిఓలతో భూ ఆక్రమణలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కోర్టు కేసుల విషయంలో కోర్టు ఆదేశాల మేరకు వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వ భూములు, బంజరు భూములు, నీటి వనరుల ఆక్రమణలను తొలగింపు చర్యలు చేపట్టాలని సూచించారు. ఆక్రమణదారులకు ముందుగా ఫారం 6, ఫారం 7 నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఆక్రమణల తొలగింపు చర్యలకు జిల్లా కలెక్టర్ లేదా సబ్ కలెక్టర్ల అనుమతులు తీసుకోవాలని స్పష్టం చేసారు. ఆక్రమణదారులు స్వచ్ఛందంగా తొలగిస్తామని ముందుకు వచ్చారని, ఆ మేరకు క్షేత్ర స్థాయిలో పనులు జరగడం లేదన్నారు. తల్లికి వందన కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. ఈనెల 10 వతేదీన అన్ని యాజమాన్య ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్స్ మీట్ నిర్వహించడం జరుగుతోందన్నారు. డిఆర్ఓ కె.పద్మలత, తహశీల్దారులు, ఎంపిడిఓలు పాల్గొన్నారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టును రద్దు చేయాలి

▸▸ జిఒ 51ని ఉపసంహరించుకోవాలి ▸▸ టోకూరు గ్రామసభలో ఏకగ్రీవంగా తీర్మానం



గ్రామసభలో ప్రాజెక్టుకు వ్యతిరేకంగా తీర్మానం చేస్తున్న సర్పంచ్, గిరిజనులు

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని టోకూరు గ్రామ సచివాలయంలో శనివారం సాధారణ గ్రామ సభ సర్పంచ్ కిల్లో. మోస్య అధ్యక్షతన జరిగింది. హైడ్రో పవర్ ప్రాజెక్టును రద్దు చేయాలని గ్రామసభ లో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ముందుగా పంచాయతీ పరిధిలోని గ్రామాల అభివృద్ధి పనులు, పారిశుధ్యం, ప్రభుత్వ పధకాలు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఒ 51, హైడ్రో పవర్ ప్రాజెక్ట ప్రతిపాదనలు తక్షణమే రద్దు చేయాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. చిటంపాడు జలపాతంలో ఏర్పాటుకు హైడ్రో పవర్ ప్రాజెక్ట పనులను అడ్డుకొని తీరుతామని సభముఖంలో స్పష్టం చేశారు ఈ సందర్భంగా సర్పంచ్ కిల్లో .మోస్య మాట్లాడుతూ, పెషా చట్టం. 1/70 వంటి చట్టాలు గిరిజనులకు రక్షణగా ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం గిరిజన చట్టాలు తుంగలో తొక్కి ఏకపక్షంగా హైడ్రో పవర్ ప్రాజెక్టును ఆధాని నవయుగ కంపెనీలకు కట్టబెట్టడం సరి కాదన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రసన్న సైలజ. వార్డు మెంబర్లు లక్ష్మణరావు, .రాముర్తి, ప్రసాద్,. పెషా కమిటీ సభ్యులు పాంగి గోపన్న, ఆనంద్, మద్దు. రవి పాల్గొన్నారు

ఆదివాసీ గిరిజన సంఘం నేతల నిరసన

ప్రజాశక్తి-హుకుంపేట: అనంతగిరి మండలంలోని పెదకోట గ్రామంలో నిర్మించనున్న హైడ్రో పవర్ ప్రాజెక్టుకు సంబంధించి ప్రభుత్వం తీసుకువచ్చిన జిఒ నెంబర్ 51ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ గిరిజన సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక గిరిజన సంఘం కార్యాలయం వద్ద శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిఒ ప్రతులను దహనం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గిరిజన సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఆదివాసుల హక్కులను తుంగలో తొక్కి, పెదకోటలో హైడ్రో ప్రాజెక్టుకు అదానీకి అనుమతులిచ్చిందన్నారు. ఇది దుర్మార్గమైన చర్య" అని అన్నారు. ప్రభుత్వ అనుమతులను తక్షణమే వెనక్కి తీసుకోవాలని, లేకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పి.సోమన్న, టి.కృష్ణారావు, సిపిఎం మండల కార్యదర్శి వి.లక్ష్మణరావు, వైస్ ఎంపిపి ఎస్. కొండలరావు, పి.లింగమూర్తి, కె.ఆనంద్ కుమార్, కె. అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



జిఒ 51 కాపీలను దగ్ధం చేస్తున్న నాయకులు

రోడ్డు మరమ్మతు చేపట్టాలి

గిరిజనుల నిరసన

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: అరకువేలి మండలం బస్కి పంచాయితీ దానిరంగిని నుండి బరెంగిబంద వరకు రోడ్డు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ కంజరితోట గ్రామ గిరిజనులు శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనంతగిరి ఐదో షెడ్యూల్ ఏరియాలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం చట్ట విరుద్ధమన్నారు. హైడ్రో ప్రాజెక్ట్ ఉన్న శ్రద్ధ గిరిజన ప్రాంతంలో ఉన్న ప్రజల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వానికి లేదని మండిపడ్డారు. గిరిజనులకు రోడ్డు సౌకర్యం కల్పించడంలో ఎందుకు నిర్లక్ష్యం వ్యవహరిస్తుందని తెలిపారు. గిరిజన గ్రామాలకు రోడ్డు లేక రవాణా సదుపాయం లేక అనారోగ్యం వస్తే వైద్యం పొందలేక గిరిజనులు తీవ్ర సతమతమవుతు న్నారన్నారు. తక్షణమే దానిరంగిని జంక్షన్ నుండి బరెంగి బంధ వరకు రోడ్డు మరమ్మతు చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.సుబ్బారావు, కె కన్నయ్య, రాంబాబు, సింహాద్రి,రామచందర్, సీతన్న ,కొత్తన్న,కె దేవన్న పీసా కార్యదర్శి, జి రామన్న, నాగేశ్వరరావు, రాజు, కృష్ణ ,అర్జున్ ,మోహన్ గ్రామస్తులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న గిరిజనులు

10న మెగా పేరెంట్స్ డేకు ముమ్మర ఏర్పాట్లు

-పాఠశాలలకు రూ. 61 లక్షల నిధులు విడుదల
-జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్



ప్రజాశక్తి-పాడేరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈనెల 10న చేపట్టిన మెగా తల్లిదండ్రుల దినోత్సవాన్ని అల్లూరి జిల్లాలో నిర్వహించేందుకు ఏర్పాట్లు నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. మెగా పేరెంట్స్ డే, తల్లికి వందన అమలుపై శనివారం కలెక్టరేట్ లో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 10 తేదీన 2900 పాఠశాలల్లో మెగా పేరెంట్స్ డే నిర్వహిస్తున్నామని స్పష్టం చేసారు. జిల్లా లో 1.07 లక్షల మంది విద్యార్థులు ఉన్నారన్నారు. 2900 పాఠశాలల్లో మెగా పేరెంట్స్ డే నిర్వహణకు రూ.61 లక్షల 11 వేల నిధులు పాఠశాలలకు విడుదల చేసామన్నారు. అన్ని యాజమాన్యాల ప్రభుత్వ పాఠశాలలు, గిరిజన సంక్షేమ ఆశ్రమ, గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, ప్రవేటు పాఠశాలల్లో మెగా పేరెంట్స్ డే నిర్వహిస్తున్నామని చెప్పారు. పాఠశాలలను సుందరంగా అలంకరించి విద్యార్థుల తల్లిదండ్రులను మర్యాదపూర్వకంగా ఆహ్వానించి పండగ వాతావరణంలో పేరెంట్స్ డే జరుగుతుందన్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగు పరచడానికి తగిన సామర్థ్యాలపై చర్యలు చేపట్టామని చెప్పారు. ప్రతీ మండలాలనికి పేరెంట్స్ డే నిర్వహణకు మండల ప్రత్యేకాధికారులను నియమించామని చెప్పారు. విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి పాఠశాలల్లో రాష్ట్రీయ స్వాస్త్య కార్యక్రమాలు అమలు చేయడానికి ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. బాలికల రక్షణ, సైబర్ క్రైమ్, ఆరోగ్యం, డ్రగ్స్ వద్దు బ్రో, గంజాయి నిర్మూలనపై అవగాహన కల్పిస్తారన్నారు. తల్లికి వందనం ప్రోత్సాహకాన్ని మొదటి విడతలో 1లక్ష 56 వేల 182 మంది విద్యార్థులకు 1 లక్ష 52 వేల,53 మంది తల్లుల ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు. ఆధార్ నంబర్లు, బ్యాంకు ఖాతాలు సక్రమంగా లేనివారికి సరిచేసి రెండవ దశలో ఈనెల 10వ తేదీన తల్లికి వందనం జమ చేయడం జరుగుతుందన్నారు. ఆయా నిధులను విద్యాభివృద్ధికి వ్యయం చేస్తామన్నారు. జిల్లాలో ఐదు మోడల్ పాఠశాలలను ఏర్పాటు చేసి వాలీబాల్, కబడ్డీ, ఆర్చరీ, అథ్లెటిక్స్, రెజ్లింగ్ తదితర క్రీడలలో శిక్షణ అందిస్తామన్నారు. మనబడి మన భవిష్యత్తు కింద భవనాలు లేని 436 పాఠశాల గుర్తించి రూ.56 కోట్లతో అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదించామని అన్నారు. ప్రస్తుతం అత్యవసరంగా మండలానికి మూడు పాఠశాలలను ఎంపిక చేసి మరమ్మతులు చేయడానికి చర్యలు చేపట్టామని చెప్పారు.వారపు సంతల్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేయిస్తామని అన్నారు.

2,200 పాఠశాలల్లో బేస్ లైన్ పరీక్ష

ప్రజాశక్తి-పాడేరు : జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా 2200 పాఠశాలల్లో విద్యార్థులకు శనివారం బేస్ లైన్ ఎగ్జామ్ నిర్వహించారు. విద్యార్థులు విద్యా ప్రమాణాలు పరిశీలించి ఎబిసిడి లుగా విభజించి విద్యా ప్రమాణాలు మెరుగుపరుస్తారు. ట్రైనీ కలెక్టర్ కె. చిరంజీవి నాగ వెంకట సాహిత్, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎల్ .రజని పాడేరు మండలంలోని గిరిజన సంక్షేమ ఇంగ్లీషు మీడియం పాఠశాల, తలారిసింగి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల, ఎం. బొడ్డాపుట్టు జిపి ఎస్ పాఠశాల, డూరు వీది ఎంపిపి పాఠశాలలో జరుగుతున్న బేస్ లైన్ పరీక్షలను తనిఖీ చేసారు. ఎం.బొడ్డాపుట్టు పాఠశాల విద్యార్థులతో కలసి మధ్యాహ్నం భోజనం చేసారు. పరీక్షా పత్రాల మూల్యంకను సక్రమంగా చేసి విద్యార్థుల స్థాయిలను గుర్తించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.

పరిసరాల పరిశుభ్రతను పాటించాలి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రత పాటించాలని ఎంపీడీవో లోవరాజు, ఉప మండల అభివృద్ధి అధికారి కేవివి సత్యనారాయణ అన్నారు. శనివారం గన్నెల పంచాయతీ పరిధి గ్రామాల్లో అమలాగూడ, గన్నేల, ఆర్కే నగర్ గ్రామాల్లో పర్యటించారు. ప్రతిరోజు చెత్త సేకరణ గ్రామాలు పరిశుభ్రంగా ఉంచుట కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ ప్రతి రోజు చెత్త సేకరణ చేయడం, వర్షాకాలంలో ప్రజలు తాగునీరుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. ప్రస్తుతం వర్షాకాలం అయినందున ఈ కాలంలో వచ్చే పలు రకాల వ్యాధులు బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు.తాగునీరును ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీరు మాత్రమే తాగాలని, దీని ద్వారా వచ్చే డెంగ్యూ, మలేరియా టైఫాయిడ్, కలరా వంటి నీటి ద్వారా వచ్చే వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీలో ఆశా వర్కర్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ

ముంపు గ్రామాల్లో గోదా'వర్రీ'

బిందువు, బిందువు కలిస్తే సింధువు అవుతుంది అన్నట్టు .. గోదావరిలో నీటి మట్టం చాపకింద నీరులా క్రమేపీ పెరుగుతోంది. తల్లి గోదారి ముంపు గ్రామాల వాసులను భయాందోళనకు గురిచేస్తోంది. వర్షాలు కురిస్తే మరింత నీటి పోటు పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే 20 అడుగులకు చేరుకున్న నీటిమట్టంతో ముంపు గ్రామాల ప్రజలు తట్టాబుట్టా సర్దుకుని సురక్షిత ప్రాంతాలకు తరలిపోతున్నారు. వర్షాలు మరింత కురిస్తే తమ పల్లెలు పూర్తిగా కనుమరుగైపోతాయని తమ గ్రామాలను కడచూపు చూసుకుంటూ భారంతో కుమిలిపోతున్నారు.

- క్రమంగా పెరుగుతున్న గోదావరి నీటిమట్టం
- భద్రాచలం వద్ద 20 అడుగులకు చేరుకున్న వైనం
- ఇంద్రావతిలో కూడా పెరుగుతున్న నీటిపోటు
- తరలిపోతున్న ముంపు గ్రామాల ప్రజలు
- అద్దెకు ఇళ్లు తీసుకుని సామాన్లు తరలింపు

ప్రజాశక్తి-కూనవరం : గోదావరి పరీవాహక ప్రాంతాలైన తెలంగాణ, ఆంధ్రాలో కురుస్తున్న వర్షాలకు గోదావరిలో నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. దీంతో ముంపు ప్రాంత ప్రజల్లో భయం మొదలైంది. కూనవరం, టేకులబోరు గ్రామాల ప్రజలు ఇప్పటికే ముంపులేని గ్రామాల్లో ఇళ్లను 3 నెలల పాటు అద్దెకు తీసుకుని సామాన్లు తరలించుకుంటున్నారు. కొన్ని గ్రామాల్లో ముందుగానే ముంపురాని ఆర్అండ్‌బీ రోడ్డు పక్కన కలపతో పాకలు వేసుకునేందుకు ముంపు గ్రామాల ప్రజలు సిద్ధమయ్యారు.

ఇంద్రావతి పొంగటంతో గోదావరికి ఎగపోటు

చింతూరు : ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలో ఇంద్రావతినది భారీ వర్షాలకు పొంగి ప్రవహిస్తుండడంతో గోదావరి నదిలోకి నీరు వచ్చి చేరుతోంది దాంతో గోదావరి నీటిమట్టం భద్రాచలం వద్ద 20 అడుగులకు చేరింది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తూ గోదావరిలో కలుస్తున్నాయి. ప్రమాదస్థాయికి మాత్రం ఇంతవరకు శబరి గోదావరి నదులు చేరుకోలేదు. ముందస్తు చర్యల్లో భాగంగా అధికారులు లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను అప్రమత్తం చేశారు.

ఆందోళనలో ముంపు ప్రజలు

ఎటపాక : గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు , ఉపనదులు పొంగి గోదావరి వరద ఉధతి నెమ్మదిగా పెరుగుతోంది. శనివారం ఉదయానికి భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 20 అడుగులకు చేరుకుంది. అయితే కాఫర్‌డ్యాం ప్రభావంతో గోదావరి వరద వాగులోకి చేరుకుంది. దీంతో గోదావరి పరీవాహక ముంపు ప్రాంతాల ప్రజలు భయాందోళన గురవుతున్నారు. అయితే ప్రస్తుతానికి భయపడే పరిస్థితి లేదని, వరద ముంపును ఎదుర్కోవడానికి అధికార యంత్రాంగం సన్నద్ధంగా ఉందని, ప్రజలు ఆందోళన చెందాల్సిన పనిలేదని ఎటపాక తహసిల్దార్ సుబ్బారావు తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం

విఆర్ పురం : దిగువన కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు ఉప్పొంగటంతో గోదావరి, శబరి నదులు పొంగుతున్నాయి శుక్రవారం ఉదయం 14 ఉన్న గోదావరి నీటిమట్టం శనివారం సాయంత్రానికి భద్రాచలం వద్ద 20 అడుగులుగా ఉంది.

శబరి, గోదావరి నదులు రెండు వడ్డుగూడెం గ్రామం వద్ద కలుస్తాయి. రెండు నదుల నుండి వరద రావడంతో వడ్డిగూడెం, ఒడ్డిగూడెంకాలనీ, ధర్మతాలగూడెం, శ్రీరామగిరి, చింతరేగుపల్లి, గ్రామాలు మునిగే ప్రమాదం ఉందని ఆయా గ్రామస్తులు భయపడుతున్నారు, ప్రభుత్వం తక్షణమే ఈ గ్రామాలకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని వారికి బరకాలు కిరోసిన్, బియ్యం నిత్యావసర సరుకులు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



భద్రాచలం వద్ద 20 అడుగులకు చేరిన గోదావరి నీటిమట్టం



సురక్షిత ప్రాంతాల్లో తాత్కాలిక పాకలు నిర్మించుకుంటున్న నిర్వాసితులు

గ్రామాల అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి - రంపచోడవరం : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో రంపచోడవరం నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయడం జరుగుతోందని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి పేర్కొన్నారు. శనివారం స్థానిక ఐటిడిఎ సమావేశ భవనంలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో సమావేశం నిర్వహించారు. రంపచోడవరం సబ్‌కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీ పాల్గొన్నారు. ఎమ్మెల్యే శిరీష దేవి మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాలు అభివృద్ధి చెందే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు స్వర్ణాంధ్రవిజన్ 2047 ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలు ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ఈ ప్రాంతంలో మెడికల్ కాలేజీ, ఒకేషనల్ శిక్షణ ఏర్పాటుకు కషి చేయడం జరుగుతుందన్నారు. పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ పరిధిలో అదేవిధంగా గుడిసె, మారేడుమిల్లి మండలంలోని పర్యాటక కేంద్రాల అభివృద్ధికి కషి చేయడం జరుగుతుందన్నారు. మద్దిగడ్డ రిజర్వాయర్ ప్రాంతం పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామ న్నారు. గిరిజన ఉత్పత్తులు పచ్చళ్ళు కొండచీపురు వంటి వాటిని ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు. రంపచోడవరం నియోజకవర్గం 12 మండలాల్లోని చేపల పెంపకం అభివృద్ధికి ప్రోత్సహిస్తున్నామన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయుటకు అదేవిధంగా ఐటిడిఎ ద్వారా జీడి మామిడి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రంపచోడవరం సబ్ కలెక్టర్ కె.ఆర్ కల్పశ్రీ మాట్లాడుతూ 2047 విజన్ స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దే విధంగా వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు యాక్షన్ ప్లాన్ ప్రకారం ఈ ప్రాంతం అభివద్ధి చేసి డేటా సమర్పించాలన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - రంపచోడవరం : ఏజెన్సీలో పర్యావరణ పరిరక్షణ బాధ్యత అందరిపై ఉందని దీనికోసం ప్లాస్టిక్ వాడకం నిరోధించాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఐటిడిఎ సమావేశ భవనంలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కడపడితే అక్కడ ప్లాస్టిక్ పడేయకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన చెత్తకుండీల్లో మాత్రమే చెత్త వేసే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ప్లాస్టిక్ నివారణకు డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఏజెన్సీలో ఎక్కడైనా ప్లాస్టిక్ సంచులు వినియోగించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు సిహెచ్ కెవి చౌదరి, సావిత్రి, సిఐ రవికుమార్, ఫారెస్ట్ రేంజ్ అధికారులు, మండల వ్యవసాయ శాఖాధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ

జనసేన పార్టీ సభ్యత్వ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - వి.ఆర్.పురం : మండలంలోని వడ్డిగూడెం గ్రామంలో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ కిట్లు, ఇన్సూరెన్స్ ఐడి కార్డులు పంపిణీ చేశారు. మండల మహిళా అధ్యక్షురాలు బాగుల ప్రమీలరాణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మండల అధ్యక్షులు ములకాల సాయికృష్ణ, మండల కార్యదర్శి బాగుల అంజనరావు, సహాయ కార్యదర్శులు ముంజపు శ్రీరామ్, మాచర్ల వేణుబాబు, యూత్ నాయకులు పెడపెట్ల పవన్‌కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదులో పాల్గొన్న పార్టీ నాయకులు

అక్రమ నిర్మాణాలు కూల్చివేయాలి

- ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్

ప్రజాశక్తి - రంపచోడవరం : గిరిజన చట్టాల్ని ఉల్లంఘించి ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తూ 5వ షెడ్యూల్ ప్రాంతంలో టూరిజం పేరుతో అర్కా (ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్) రిసార్ట్స్‌లో అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు చేపడుతుంటే అధికారులు చోద్యం చూస్తున్నారని గిరిజన సంఘం రంపచోడవరం జిల్లా కార్యదర్శి పులి సంతోష్ ఆరోపించారు. రోడ్ల వెడల్పు పేరుతో చిరు వ్యాపారం చేసుకునే గిరిజనుల పాకల్ని కూల్చేసిన మీకు అర్కాలో కడుతున్న అక్రమ నిర్మాణాలు ఎందుకు కనపడ టం లేదని నిలదీశారు. ఐటిడిఎ ఉన్నది నిజంగా ఆదివాసీల కోసమేనా ? అంటూ ఆయన ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే అర్కా రిసార్ట్స్‌లో అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని లేని పక్షంలో ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో ఉన్న ఖాళీ స్థలాన్ని ఆదివాసీలు భూ అక్రమణ చెయ్యాల్సి వస్తుందని హెచ్చరించారు.

బూత్ లెవెల్ అధికారులకు శిక్షణ

ప్రజాశక్తి - రంపచోడవరం : రంపచోడవరం (ఎస్‌టి) శాసనసభ నియోజకవర్గంలో బూత్ లెవెల్ అధికారులకు ఎన్నికల జాబితా నిర్వహణ (ఎలక్టోరల్ మేనేజ్‌మెంట్)పై శిక్షణ కొనసాగుతోంది. ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి సబ్ కలెక్టర్ కల్పశ్రీ పర్యవేక్షణలో నిర్వహించబడుతోంది. ఇండియా ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా శిక్షణ నిర్వహించబడుతోంది. శనివారం శిక్షణ రెండోరోజు బ్యాచ్2గా కొనసాగింది. ఇందులో 51 మంది బూత్‌లెవెల్ ఆఫీసర్లు పాల్గొన్నారు. ప్రతి రోజూ 50 మంది చొప్పున, మొత్తం 9 బ్యాచ్‌లుగా శిక్షణను కొనసాగించనున్నారు. మొత్తం 399 మందికి శిక్షణ ఇస్తారు.



మాట్లాడుతున్న ప్రజానాట్యమండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి ఐవి

పోలవరం ప్రాజెక్టుతో గిరిజన కళలకు ప్రమాదం

ప్రజాశక్తి-కూనవరం : పోలవరం ప్రాజెక్టుతో గిరిజన కళలు అంతరించిపోయే ప్రమాదం ఉందని ప్రజానాట్యమండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి ఐ.వి అన్నారు. ప్రజానాట్యమండలి రంపచోడవరం జిల్లా కమిటీ విస్తృత సమావేశం కూనవరం మండలంలోని మార్త శ్రీరామ్‌మూర్తి భవన్‌లో శనివారం నిర్వహించారు. విస్తృతస్థాయి సమావేశానికి ప్రజానాట్యమండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి ఐ.వి. ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సోడె దుర్గారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఐ.వి మాట్లాడుతూ గిరిజన సంప్రదాయ కళలను కాపాడటం కోసం ప్రజానాట్యమండలి నిరంతరం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి సీనియర్ నాయకులు సిహెచ్.సుబ్బారావు, కూనవరం మండలం కన్వీనర్ కారం కన్నారావు, పట్రా రాధాకృష్ణ, మహిళా నాయకులు సోడి కష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర - అరకులోయలో బైక్ ర్యాలీ



అరకులోయలో ర్యాలీను ప్రారంభిస్తున్న సురేంద్ర

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: కార్మికులకు నష్టదాయకమైన కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కార్మికులు పోరాడి సాధించుకున్న పాత చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా ఈనెల 9వ తేదీన జరిగే సమ్మె జయప్రదం పై శనివారం అరుకులోయలో సిఐటియు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ బైక్ ర్యాలీని ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, దేశవ్యాప్త సమ్మెకు ఆదివాసీ గిరిజన సంఘం సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని తెలిపారు కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వ రంగాన్ని సర్వనాశనం చేసి కార్మిక హక్కుల్ని కాలరాశి ధనవంతులకి లాభాలు చేకూర్చే విధంగా నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చారని తెలిపారు. దీన్ని కార్మిక వర్గం చూస్తూ ఊరుకోదని, ప్రభుత్వం పై పెద్ద ఎత్తున ఉద్యమిస్తుందని అందుకు కార్మిక కర్షకులు ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. నరేంద్ర మోడీ విధానాలతో గిరిజన ప్రాంతంలో ఐదవ షెడ్యూల్ ఉన్న హక్కులని కాలరాస్తున్నారని, చట్ట విరుద్ధంగా హైడ్రో పవర్ ప్రాజెక్టు పేరుతో ఆదానికి కట్టబడుతున్నారని తెలిపారు. ఇప్పటికే జీవో 3 కోల్పోయి నిరుద్యోగులు, ఉద్యోగస్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వం విధానాలపై గిరిజనులు, కార్మికులు ఐక్య పోరాటాలు నిర్వహించి ప్రభుత్వ మెడలు మంచాలని తెలిపారు. దేశవ్యాప్తంగా 9న జరిగే సమ్మె విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు, అరుకు మండల కన్వీనర్ భగత్ రామ్, ఐటిడిఏ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు దాడి రాజు, ఏపీ టూరిజం వర్కర్స్ యూనియన్ నాయకులు ధర్మ, సురేష్, ఆదివాసి గిరిజన సంఘ నాయకులు బుజ్జిబాబు, రామారావు పాల్గొన్నారు.

హుకుంపేట: దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సిఐటీయూ మండల నాయకులు, మండల పరిషత్ వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు పిలుపునిచ్చారు. శనివారం కాఫీ లైజన్ వర్కర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక హక్కులను కాలరాసే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి కార్మికుడికి నెలకు కనీసం రూ.26,000 జీతం చెల్లించాలనీ, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీను, వాసు, కృష్ణారావు, సోమన్న, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



హుకుంపేటలో మాట్లాడుతున్న నాయకులు



రోగి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న డిఎం అండ్ హెచ్ఓ

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

వైద్య ఆరోగ్య శాఖ అధికారి విశ్వేశ్వర నాయుడు

ప్రజాశక్తి-పాడేరు:- పాడేరు మండలం ఈదులపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పి హెచ్ సి)లో అల్లూరి సీతారామరాజు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. టి విశ్వేశ్వర నాయుడు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఈదులపాలెంలో అనారోగ్యంతో వచ్చే రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. పి.హెచ్.సి లో ప్రతి నెల 15 సుఖ ప్రసవాలు విధిగా జరుగునట్లు చర్యలు తీసుకోవాలని వైద్యాధికారిని ఆదేశించారు.మందుల నిల్వలను, రికార్డులను తనిఖీ చేశారు. ఎపిడమిక్ సీజన్ కావడంతో అత్యవసర మందులు, వ్యాక్సిన్‌లను సిద్ధంగా ఉంచుకోవాలని వైద్యులకు సూచించారు. ప్రసూతి తేదికి వారం రోజులు ముందు దగ్గర్లో ఉన్న ప్రసుతీ నిరీక్షణ కేంద్రానికి లేదా బర్త్ వెయిటింగ్ హోమ్ కు తరలించాలని సూచించారు. క్షేత్ర స్థాయి సిబ్బంది విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని వైద్యాధికారికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పి.హెచ్.సి వైద్యాధికారి నరసింహారావు, వైద్య సిబ్బంది పాల్గున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

ప్రజాశక్తి- అరకులోయ: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సైనికుల్లా టిడిపి కార్యకర్తలు పని చేయాలని అరకు అసెంబ్లీ నియోజకవర్గం అబ్జర్వర్ కరణం శివరామకష్ణ అన్నారు. సుపరిపాలన –తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా అరకులోయకు విచ్చేసిన ఆయన స్థానిక ఉషోదయ రిసార్ట్స్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.అరకు నియోజకవర్గం ఇంచార్జి ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్ను దొర ఆధ్వర్యంలో పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించేందుకు వీలుగా ఇప్పటినుండే సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పిటిసి గెలుపే లక్ష్యంగా అభ్యర్థులను సంసిద్ధత చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నట్లు ఆయన అన్నారు.గెలుపు గుర్రాలకే ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన అన్నారు.2029 ఎన్నికల్లో అరకు నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగురవేస్తుందని ఆయన అన్నారు.
అరకు నియోజకవర్గ ఇన్ఛార్జి, ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్ను దొర మాట్లాడుతూ, అరకు నియోజకవర్గంలో అబ్జర్వర్ గా కరణం శివరామకష్ణను నియమించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.సూపర్ సిక్స్ పథకాలు విజయవంతంగా అమలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అరకులోయ, డుంబ్రిగూడ మండలాల తెలుగుదేశం పార్టీ నాయకులు ఆనంద్, గెన్ను, వెంకటరావు, పెట్టెలి రాము, గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అబ్జర్వర్ శివరామకృష్ణ




ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితుడు

వర్షాలకు కూలిన ఇల్లు

ప్రజాశక్తి-చింతపల్లి: మండలంలోని ఎర్రబమ్మల పంచాయతీ పరిధిలోని రోలంగి గ్రామానికి చెందిన లోత లక్ష్మయ్య కుటుంబానికి ఇటీవల కురిసిన ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలకు ఇంటి పెంకులు కూలిపోయాయి. ప్రమాదం సంభవించే సమయంలో కుటుంబ సభ్యులు సురక్షితంగా బయటకు వెళ్లడంతో పెను విషాదం తప్పిందని లక్ష్మయ్య తెలిపారు. ప్రభుత్వం పరిస్థితిని గమనించి వెంటనే సహాయం అందించాలని కోరుతున్నారు.

రోడ్డు విస్తరణ జాప్యంపై వైసిపి నిరసన



రోడ్డుపై బైఠాయించిన ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు పట్టణంలో రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యం సరికాదని, వెంటనే రోడ్డు అభివృద్ధి పనులు ప్రారంభించాలని స్థానిక ఎమ్మెల్యే ఎం.విశ్వేశ్వరరాజు డిమాండ్ చేశారు. రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యం, అధికారుల తీరును నిరసిస్తూ శనివారం ప్రధాన రహదారిపై వైసిపి నాయకులతో కలసి బైఠాయించి నిరసన తెలిపారు. రోడ్డు విస్తరణపై అధికారులు స్పష్టమైన హామీ ఇవ్వాలని వర్షం పడుతున్న లెక్కచేయకుండా రోడ్డుపై కూర్చొని అక్కడే భోజనం చేశారు. సుమారు గంటన్నర పాటు బైఠాయించడంతో వాహనాలు నిలిచిపోయాయి. పాడేరు సిఐ డి.దీనబంధు ఆధ్వర్యంలో పోలీసులు, రెవిన్యూ సిబ్బంది చేరుకొని ఎమ్మెల్యేతో మాట్లాడారు. ఉన్నతాధికారులు వచ్చి స్పష్టమైన హామీ ఇస్తేనే ఆందోళనను విరమిస్తానని ఎమ్మెల్యే చెప్పడంతో.. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ అక్కడికి చేరుకొని ఎమ్మెల్యేతో మాట్లాడారు. రోడ్డు విస్తరణలో భాగంగా ఆక్రమణల తొలగింపులో కూటమి నేతలు జోక్యంతో, రాజకీయ ఒత్తిళ్లతో రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యం జరుగుతోందని ఎమ్మెల్యే తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి రాజకీయ జోక్యం లేదని, రోడ్డుకు ఇరువైపులా షాపులను స్వచ్ఛందంగా తొలగించుకునేందుకు కొన్ని రోజులు గడువు ఇవ్వాలని కొద్ది మంది వ్యాపారులు అడగడంతో సమయం ఇవ్వడం జరిగిందన్నారు. కలెక్టర్ నచ్చచెప్పడంతో ఆందోళనను విరమించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కాతరి సురేష్, సీదరి రాంబాబు, మినుముల కన్నాపాత్రుడు, కూడా సుబ్రహ్మణ్యం, వంతల రాంబాబు, కూడా సురేష్, తదితరులు పాల్గొన్నారు.

బురదలో కూరుకుపోయిన లారీ : నిలిచిన రాకపోకలు

ప్రజాశక్తి -సీలేరు: ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు అంతర్రాష్ట్ర రహదారి పిల్లిగెడ్డ వద్ద శనివారం ఉదయం సిమెంట్‌లోడు లారీ బురదలో కూరుకు పోయింది. దీంతో రాకపోకలు నాలుగు గంటల పాటు నిలిచిపోయాయి. గత ఏడాది వైసిపి ప్రభుత్వం పిల్లిగెడ్డ వంతెన నిర్మాణానికి నిధులు కేటాయించి కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించింది. వంతెన పనులు జరుగుతుండగా గత ఏడాది వరదల కారణంగా జెసిబిలు, యంత్రాలు వరదలో కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. అనంతరం పనులు కాంట్రాక్టర్ పూర్తి చేసినా ఇరువైపులా అప్రోచ్ బిటి రోడ్డు నిర్మించలేదు. తాత్కాలికంగా ఇరువైపులా మట్టి వేసి చేతులు దులుపుకున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు మట్టి బురద మయంగా మారిపోయి వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఎంతో ప్రాధాన్యం ఉన్న ఈ రహదారి బాగుచేయాలని పలువురు కోరుతున్నారు.



కూరుకుపోయిన లారీ

కూటమి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం

ప్రజాశక్తి - రంపచోడవరం : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 'సుపరిపాలన - తొలిఅడుగు' కార్యక్రమంలో భాగంగా రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గడిచిన సంవత్సర కాలంలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రతి నియోజకవర్గంలోని ఎమ్మెల్యేలు ఇంటింటిరీ తిరిగి సంవత్సర కాలంలో చేసిన అభివృద్ధికి సంబంధించి సంక్షేమ పథకాలు గురించి వివరించడం జరుగుతుందన్నారు.

'సుపరిపాలన - తొలిఅడుగు' కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన వస్తోందన్నారు. సంవత్సర కాలంలో తాను నియోజక వర్గ అభివృద్ధికి కృషి చేశానన్నారు. ఇది ఓర్వలేని వైసిపి నాయకులు ఎమ్మెల్సీ అనంతబాబు, మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని వాటిని ప్రజలు నమ్మవద్దని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చిన్నంబాబు రమేష్, ఏడు మండలాల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

ప్రజాశక్తి - రంపచోడవరం : ఏజెన్సీ ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం రంపచోడవరం మండలం బందపల్లిలో గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలను, అంగన్‌వాడి కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు ఒకటికి రెండుసార్లు అర్థమయ్యే విధంగా ఉపాధ్యాయులు బోధించాలన్నారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం మెనూ అమలు చేయాలని సూచించారు. అందరికీ పుస్తకాలు, నోటుపుస్తకాలు అందాయా లేదా అనే విషయం ఆరా తీశారు. ప్రస్తుతం ఎంతమంది విద్యార్థులు, సిబ్బంది ఉన్నదీ తెలుసుకున్నారు. నిత్యావసర సరుకులు, ఏ విధంగా సరఫరా చేస్తున్నారో ఆరా తీశారు. విద్యార్థులు ఎవరికైనా సీజనల్ వ్యాధులు ఉంటే ఆసుపత్రికి తీసుకువెళ్లి చికిత్స చేయించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఎంతమంది విద్యార్థులు, గర్భిణులు అనే విషయం తెలుసుకున్నారు. అనంతరం సీతపల్లి మండల పరిషత్ పాఠశాల పరిశీలించారు.

ఆశ్రమ పాఠశాలల తనిఖీ

మారేడుమిల్లి: ఏజెన్సీలో గిరిజన ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులు ఏ విధంగా చదువుతున్నదదీ ఎప్పటికప్పుడు పరీక్షించాలని రంపచోడవరం గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య పేర్కొన్నారు. శనివారం మారేడుమిల్లి మండలం తాడేపల్లి, రంపచోడవరం మండలం బూసుగూడెం ఆశ్రమ పాఠశాలలను డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏజెన్సీలో గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఎప్పటికప్పుడు బేస్‌లైన్ టెస్ట్‌లు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యార్థులకు ప్రతిరోజు మెనూ అమలు చేయడం జరుగుతుందన్నారు.




బూసుగూడెం పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డిడి రుక్మాండయ్య

ప్రతి పాఠశాలలోనూ బేస్‌లైన్ పరీక్షలు

అడ్డతీగల : స్థానిక మండల కేంద్రంలో గల పాఠశాలల్లో ఎంఇఒ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం జిల్లాలో అన్ని పాఠశాల ల్లో బేస్‌లైన్ పరీక్షలు నిర్వహించారు. మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులలో తెలుగు, ఇంగ్లీష్, గణితం సబ్జెక్టుల్లో విద్యార్థుల ప్రగతిని తెలుసుకోవడానికి వారి స్థాయి గుర్తించేందుకు ఈ పరీక్ష నిర్వహించారు. పరీక్షలు జిల్లా స్థాయి నుండి మండలస్థాయి వరకు వివిధస్థాయి అధికారులు తనిఖీలు నిర్వహించారు. అడ్డతీగల మండలంలో 97 పాఠశాలల్లో ఈ పరీక్షలు నిర్వహించారు. స్థానిక హైస్కూల్‌లో క్లస్టర్ ప్రధాన ఉపాధ్యాయురాలు వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు పి.మంగరాజు, కె .రవికుమార్ తనిఖీ చేశారు.



బందపల్లి పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న పిఒ సింహాచలం



అడ్డతీగలలో పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎంఇఒ శ్రీనివాస్ తదితరులు



రహదారిని పరిశీలిస్తున్న లోతా రామారావు

బొర్రంపేట రహదారి నిర్మించాలి

ప్రజాశక్తి- రాజవొమ్మంగి: మండలంలోని బడదనాంపల్లి నుండి బొర్రంపేట వెళ్లే రహదారి నిర్మించాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు డిమాండ్ చేశారు. శనివారం లోతా రామారావుకు గిరిజనులు రహదారి అధ్వాన పరిస్థితి గురించి వివరించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు మాట్లాడుతూ ఈ రహదారి, రాజఒమ్మంగి మండలం నుండి నర్సీపట్నం, కోటనందూరు, తుని తదితర ప్రాంతాలకు వెళ్లే వందలాదిమంది ప్రయాణికులు, వాహనదారులు నిత్యం ఈ రహదారి నుంచే ప్రయాణం సాగిస్తుంటారు. అటువైపు నుండి రాజుపేట వరకూ ఉంది. మధ్యలో సుమారు ఐదు కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణం చేస్తే ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉంటుంది. ఈ ఐదు కిలోమీటర్లు రహదారి అధ్వానంగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు స్పందించి లక్కవరపాడు నుంచి రాజపేట వరకు రహదారి నిర్మాణం తక్షణం చేపట్టాలని లేకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. గిరిజన సంఘం నేతలు మేలిన పెద్ద రమణ, నాగరాజు, సుబ్బారావు, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యల పరిష్కారానికి పోరాటమే శరణ్యం

ప్రజాశక్తి - రాజవొమ్మంగి: స్థానిక ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాటమే శరణ్యమని సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ అన్నారు. శనివారం రాజవొమ్మంగి ప్రజాసంఘాల కార్యాలయంలో సిపిఎం మండల కమిటి సమావేశం పార్టీ మండల కమిటి సభ్యులు పాండవుల సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ మాట్లాడుతూ ఏజెన్సీలో ప్రతి గ్రామంలో స్థానికంగా అనేక సమస్యలు ఉన్నాయని వాటిని సిపిఎం నాయకులు గుర్తించి వాటి పరిష్కారానికి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇటీవల విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై మోయలేని భారం వేసిందన్నారు. ఏజెన్సీలో రైతులకు సబ్సిడీపై పూర్తిస్థాయిలో ఖరీఫ్ సీజన్ దాటకముందే వరి విత్తనాలు పంపిణీ చేయాలన్నారు. ఈ నెల 9న నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెను కార్మికులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు, మట్ల వాణిశ్రీ, జిల్లా కమిటీ సభ్యులు కొండ్ల సూరిబాబు, మండల కమిటీ సభ్యులు కుంజం జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్

రైతులకు కషాయాల తయారీ డ్రమ్ముల పంపిణీ



రైతులకు అందజేసిన డ్రమ్ములు, క్యాన్లు, పాత్రలు

ప్రజాశక్తి - విఆర్ పురం: మండలంలోని రేఖపల్లి ఎఎస్‌డిఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు కషాయాలు తయారు చేసేందుకు అవసరమైన డ్రమ్ములు క్యాన్లు , పాత్రలు, స్టవ్‌లు చింతూరు మండలం చదలవాడ పంచాయతీలోని వాలుమోరు గొంది, తులసిపాక, సిరసనపల్లి చదలవాడ లక్కవరం, విఆర్‌పురం మండలంలో ములకనపల్లి పంచాయతీ నుండి కుందులూరు, గుల్లేటివాడ, గుంజవారిగూడెం, తెల్లవారిగూడెం గొల్లగూడెం, కొత్తపేట గ్రామాల రైతులకు 20 లీటర్ల క్యాన్స్ 40, 200 లీటర్ల డ్రమ్స్ 20, 100 లీటర్ల డ్రమ్స్ 10, ,50 కిలోల పాత్రలు2, 20 కిలోల పాత్రలు 6 , స్టౌవ్‌లు 2 పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ చల్లారి సాయిచైతన్య, క్లస్టర్ కోఆర్డినేటర్ మీనా, గొర్రె ముత్యాలరావు రవి గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- రాజవొమ్మంగి: మండలంలోని కింద్ర రింగ్‌రోడ్ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని అనంతగిరి గ్రామానికి చెందిన ధూళి వివేక్‌వర్ధన్, రాజవొమ్మంగి గ్రామానికి చెందిన గొల్లపల్లి శ్రీనివాస్, ముర్లవానిపాలెం గ్రామానికి చెందిన సోముల వంశీ జడ్డంగి వైపు నుంచి బైక్‌పై రాజవొమ్మంగి వస్తుండగా దూసరపాము గ్రామశివారులో రహదారిపై గేదె అడ్డు రావడంతో తప్పించబోయి అదుపు తప్పి పడిపోవడంతో వివేకవర్ధన్, శ్రీనుకు ఎడమకాలు విరిగిపోగా గాయాలయ్యాయి. వంశీకి తలపై, ఒంటిపై తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు క్షతగాత్రులను స్థానిక పిహెచ్‌సికి తరలించగా ప్రాథమిక చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం ఏలేశ్వరం తరలించారు. వైద్యులు అందుబాటులో లేకపోవడంతో గంటలకొద్దీ క్షతగాత్రుల కుటుంబ సభ్యులు రాజవొమ్మంగి పిహెచ్‌సి వద్ద నిరీక్షించారు. ఈ విషయమై నియోజకవర్గ ఎమ్మెల్యే మిర్యాల శిరీషదేవి, విజయభాస్కర్‌కు 'ప్రజాశక్తి' సమాచారం అందించగా ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద నిరంతరం వైద్యులు అందుబాటులో ఉండాలని, అందుబాటులో లేని వైద్యులపై చర్యలకు ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు.

కొలువుదీరిన వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ

ప్రజాశక్తి - రంపచోడవరం : వ్యవసాయ మార్కెట్‌యార్డు నూతన పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ చైర్మన్ లోతా లక్ష్మణరావు వైస్‌చైర్మన్ సలాది బాపిరాజు, సభ్యులు ఆచంట శ్రీనివాసరావు, జయమ్మ, మాణిక్యం, రాంబాబు, సత్యనారాయణమ్మ, రామారావు, సాల్మన్ రాజు, శివశంకర వరప్రసాద్, సత్యవతి, అమ్మాజీ, గీతాంజలి, రాంబాబు ప్రమాణ స్వీకరణ తదనంతరం రంపచోడవరం నియోజకవర్గ శాసన సభ్యులు శిరీష దేవి, మాజీ శాసనసభ్యులు చిన్నంబాబు, రమేష్ పార్టీ నాయకులు అభినందనలు తెలియజేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీషదేవి